

# ఓ నాటి పత్రికలో

"వాణీనాథ్."

నేను శలవు తీసుకొని యింటివద్ద కూర్చున్నా. శలవు చాలామట్టుకు అయిపోయింది. మధ్యాహ్నంనుంచీ పడకకుర్చీలో కూర్చుని యేదో చదువుతూవున్నా. సరియయిన పుస్తకాలు యేమీ లేక మా తమ్ముడు యిక్కడకు వచ్చినప్పుడు చదివి విడిచిపెట్టిన పాత పత్రికలు దగ్గర ఉంచుకొని, ఒక్కొక్క పత్రికా తీసి, మొట్టమొదటి పేజీ మొదలుకొని ఆఖరుపేజీ వరకూ వున్న ప్రతి అయిటమూ చదువుతూ కూర్చున్నా. పాతపత్రికలు అయినప్పటికీ విషయాలన్నీ చదువుతూ వుంటే ప్రపంచమంతా కళ్ళయెదుట కట్టినట్లుంది.

నెలకు వందరూపాయిలు తెచ్చుకునే యేబదియేళ్ల ఉద్యోగస్తుని వివాహమాడే స్త్రీలు ముందుకు రావలసిందనీ, యేజాతి అయినాసరే విధవ అయినాసరే అభ్యంతరము లేదనీ, కాని కొద్దో గొప్పో కట్నము యివ్వగలఆవిడ వుంటే మంచిదనీ చదివినప్పుడు నాకు వళ్ళు మండింది. మానవునియొక్క నీచ స్వభావము యిలా వుంటుంది కదా అని నాలో నేను అనుకున్నా. యీవిధంగా పత్రికలో ప్రకటించిన మహాఘనుడు పశుత్వాన్ని వెల్లడి చేసుకోడానికయినా సిగ్గులేక పోయిందేమా అని ఆలోచనలోపడ్డా. పరితాపపడ్డా.

★

ఢిల్లీ నగరంలో ఒక పెద్ద ఫర్మ్ ఉందిట. ఆ ఫర్మ్‌కు నెలకు 75రూపాయిలకు పనిజేసే మేనేజరు కావాలనీ, అప్లికెంటు (దరఖాస్తుదారు) ఐదువేల రూపాయలు ధరావతు కట్టవలసి వుంటుందనీ ఒక ప్రకటన కనబడింది. పేరు కీర్తులుగల ఫర్మ్ అయినట్లయితే ఢిల్లీ నగరంలోగాని, పరిసరప్రాంతాల్లోకాని, వీరికితగిన మేనేజరు దొరకలేదూ? మదరాసు రాష్ట్రములో ప్రచారములో నున్న పత్రికల్లో యీ ప్రకటన వేయవలసిన అగత్యమేమా అని నాకు సందేహం తోచింది. నిరుద్యోగులతో దేశమంతా నిండిపోయిన యీ దరిద్ర దినములలో, యెవడైనా బుద్ధి తక్కువవాడుంటే, భూమీ పుట్రా అంతా తెగ నమ్మివేసి ముద్దజేసి, అయిదువేల రూపాయిలు పట్టుకు వెళ్ళేవాడుంటే, నిముషాల్లో మోసంచేసి, సొమ్ము అణాపైసలుతో హరించి, దరిద్రుణ్ణిచేసి యింటికి పంపడానికి యెవడోవేసిన యెత్తురా యిది అనిపించింది.

పరాయి చోటు కదా, డబ్బు లాక్కోవడమే కాకుండా ప్రాణాలు కూడా తీస్తారేమో, యెవరు చెప్పగలరు?

★

యావద్భారత ప్రఖ్యాతిగల జ్యోతిష్కుడొకడు, (పేరుతో పనే ముందిలెండి- చాలా చాలా గొప్పవాడు) ఒక్కరూపాయి మనియార్డరు చేస్తే, యే అయిదు ప్రశ్నలకైనా సరే, తిరుగుటపాలో మనకు అనుకూలంగా వుండేలాగున సమాధానాలు పంపుతానని సిద్ధముగా కూర్చున్నాడు. ఆయన బొమ్మకూడా వేసుకున్నాడు పత్రికల్లో. నొసలు ముడుతలు పడివుంది. దృష్టిచూస్తే అగాధంలోనికికూడా చొరుచుకు పోతుందా అన్నట్టుగా గోచరిస్తూ వుంది. బొమ్మచూస్తే నమ్మితీరాలి. చేతిలో డబ్బులేకపోతే యెవరి వద్దయినా అప్పుచేసి మనియార్డరుచేసి చూడండి. జాతకఫలాలెలా వున్నాయో నాక్కూడా వ్రాయండి.

★

ఒక మహామాంత్రికుడు (మంత్రశాస్త్రం చదువుకున్నాడో లేదో తెలియదు) చాలా వ్యయప్రయాసలకులోనయి, నాగరిక ప్రపంచము మనల్ని నరకానికి దారితీస్తుందని భయపడి, హిమాలయ పర్వత ప్రాంతాలకు పోయి, ఆ మంచుకొండల్లో ముక్కు మూసుకొని తపస్సు చేసుకునే మునిపుంగవులను వెదకి పట్టుకొని, వారివద్ద మంత్రోపదేశం పొంది, తద్వారా తావీదులను తయారుచేసి, సనాతనిష్టులు పళ్లు యెంత పటపటకొరికినా లెక్కచేయక, జాతి మత భేదములు పాటించని కాముకీ కాముకులను జత పర్చడానికి కావలసిన సాహాయ్యము చేసి పుణ్యము కట్టుకోడానికి సంకల్పించుకున్నాడు. ఇట్టి మహోపకారానికి యీయన కోరేది ఒక్క వరహా దక్షిణ మాత్రమే. అంతకంటే యెక్కువకోరడు. అదనంగా ముట్టచెప్పాలని మీకుతోస్తే ఆయన అటంక పెట్టడు. ఎంత త్యాగమో చూడండి! డబ్బు అందిన వెంటనే మనకొక రాగి తావీదుమాత్రం పంపుతాడులెండి! ఎవరన్నా చూస్తే బాగుండదనిచెప్పి మనకుతోస్తే దానిని మునము మొలకుకూడా కటుకోవచ్చునట! దోషం యేమీలేదు.

★

మర్రివూడల్లా వెంట్రుకలు పెరగడానికి సుగంధయుతమగు తలనూనెలూ (మగవాళ్లకు అనుకుండేరు-కాదు, ఆడవాళ్ళకు), వెంట్రుకలను ఒక్క పదిపూటల్లో తుమ్మెదలను ధిక్కరించేటంత నల్లని వాటిగా చేసే లేపనాలూ, (ఇవి ముఖ్యంగా యవసుమీరిన ఉద్యోగస్తులకూ, సొసైటీలో యెల్లప్పుడూ కాలముగడిపే పెద్ద తరహా పెద్ద మనుష్యులకూ చాలా అవసరం) దేవతా వస్త్రాలను మించి వుండే పాముకుబుసాల్లాంటి సిల్కు చీరలూ, నూతనంగా సృష్టించబడిన ధగధగమని మెరిసేనగలూ, (వీటి అవసరం నారీరత్నములకు బాగా తెలుసు, డబ్బుయిచ్చుకొనేటప్పుడు మగవాళ్లకుకూడా బాగా తెలుస్తుంది లెండి!) చర్మాన్ని యేమాత్రమూ చిట్లించకుండా, మహా నున్నితంగా, చక్కగా వెన్న ప్రాకినట్లు పనిచేసే మంగలి కత్తులూ (వాడినప్పుడు రంపం కోతలా వుండి చర్మము వూడి వస్తే అది మన తప్పు- దానికి కంపెనీవారు బాధ్యులెలా అవుతారు?) అతి సూక్ష్మంగా వెంట్రుకల్ని తొలగించే రోమసంహారి సబ్బులూ యింకా యేమేమో వస్తువులను తప్పకుండా కొని కృతార్థులు వలసిందనీ, త్వరత్వరగా నవనాగరకత అలవరచుకోవలసిందనీ మనల్ని కోరే 'ప్రజాసేవకుల' హితోక్తులు వేలూ, లక్షలూ వున్నాయి. బ్రిటిషువారు—మన బాగుకోసం, మనం యింకా మన మంచి చెడ్డల్ని నిర్ణయించుకొని సంస్కరించుకొనే స్థితికి మనం రాలేదని చెప్పుతూ వుంటారు మీరు చూస్తూ వున్నారా? యీ సూత్రాన్నే బాగా గమనించిన మన "ప్రజాసేవకులు" మనకు మంచి చేకూర్చడానికని, వారి అనుభవాన్ని బట్టి మనకు వుపకరించే వస్తుసామగ్రిని డబ్బు

పుచ్చుకొని మనకు పంపుతానంటూ వున్నారు. తరుణము పోగొట్టుకొనక మీరు బాధ పడండి- లేదా మానివెయ్యండి. నా పూచీ యేమీ లేదు.

★

మనుష్యమాత్రుడయినప్పుడు జబ్బుచేయక మానదుకదా. ఇందుకు మందులు చాలా అవసరం. ఇవి కూడా వున్నవి పత్రికల్లో. కొన్నికొన్ని చోట్ల యే జబ్బు యెలా పుడుతుందో, క్రమక్రమంగా యెలా వృద్ధి అవుతుందో, యెలా మానవ జాతిని లొంగదీసి చంపేస్తుందో విపులంగా వ్రాసి—ఇంతే కాకుండా బొమ్మల్ని కూడా వేసి మనకి బోధ చేసేవారు వున్నారు. ఇలా వ్రాసే వారు నాబోటి శుంఠలు అనుకోకండి. లెక్కలేనన్ని ప్రాణాల్ని చూచిన గొప్పగొప్ప డాక్టర్లు. ప్రాశ్చాశ్చాత్య దేశాలన్నింటినీ కలగద్రొక్కిన మహానుభావులు. వీరికి చాలా అనుభవం వుంది. ఈ సంబంధమైన ప్రకటలను మనం ఒక్కసారి చదివితే చాలు, మన వంట్లో ఆ వ్యాధులూ, ఆ వ్యాధి లక్షుణాలూ, ఇహ డాక్టరు సలహా కాని, సహాయం కాని లేకుండానే మనకు కనబడతాయి. మనలో కనబడే వ్యాధి విజృంభించి పోతుంది. చూస్తూ వుండగానే వొళ్ళు పొట్ల ఒండులా విడిపోతుంది. కొన ఊపి
వ
రితో వున్న పీనుగలై పోతాం. కళ్లు చీకట్లు కమ్ముతాయి. మృత్యువు మన కళ్లయెదుట సాక్షాత్కరించి తాండవమాడుతుంది. మీదకు దూకబోతుంది. మనల్ని మ్రింగడానికి మనమీదకు దూకుతానని హుంకరిస్తుంది. ఇహ మనకు నిద్ర పట్టదు. ఆలస్యంచేస్తే భార్యా బిడ్డలికి దూరమైపోయి నరకంలో పడిపోతామనే భయం వెన్నాడుతుంది, కాబట్టి డబ్బు లేకపోతే అప్పుచేసో, పుస్తీపుడకా అమ్మివేసో మందు కొనుక్కుంటాం. దానితో తెగులు కుదురుతుంది. ఆ వ్రాతల్లోవుంది యీ మహిమఅంతా! కాబట్టి యిటువంటి ప్రకటనలు మీరు నిశ్చలమైన మనస్సుతో కళ్ళు మూసుకొని చదివి జీర్ణించుకోవాలి. అలాచేస్తే ఒంటికి చాలా మంచిది.

★

ఇహ కోర్టు వ్యవహాలుకూడా వుంటవి. ఇవి చాలా ముఖ్యమైనవి. మేధావంతులైన లాయర్లు, పెద్ద పెద్ద గౌన్లూ తొడుగుకొని (ఇవి అంద వికారంగావుంటే మాత్రం, బ్రిటిషువారి ధర్మమా అంటూ ప్రసాదింప బడ్డవి కాబట్టి అవి చాలా మంచివే!) బల్లగుద్ది చేసే వాదాలు మనం బాగా గ్రహించామంటే, మానవ సంఘానికి వారు చేసేసేవ, (మన దగ్గరవున్నది కాస్తా వారు ఫీజు క్రింద గుంజివేస్తేనేమి?) వారుచేసే మహోపకారమూ తరతరాల వరకూ మరువ తగ్గవికావు. అనాలోచితంగా నైతేనేమి, బుద్ధిపూర్వంగా నైతేనేమి మనంచేసే పనులకు, గవర్నమెంటు అంటూ వొకటివుంది కనుక, న్యాయశాస్త్రప్రకారం మనం శిక్షు అనుభవించాలిగా! అలాంటప్పుడు డబ్బుంటే సరి, లాయర్లు మనకు సహాయంచేస్తారు! డబ్బు లేకపోతే దేవుడుకూడా మన వేపు చూడడంటారు మన పెద్దలు. డబ్బుంటేనే అంతా. తృణమో, పణమో మనం ముట్టచెప్పామంటే మన లాయర్లు యెంతెంత ఉపకారాలు చేస్తారు! మన కోసమని వారు యెన్ని అబద్ధప్రమాణాలు చెయ్యాలి; యెన్ని తప్పుడు సాక్ష్యాలు సృష్టించాలి. ఏ తర్కవాదమో, యే పిడివాదమోచేసి, 'నేను వినను- నేను నమ్మను' అని బిర్రబిగిసి కూర్చున్న న్యాయాధికార్ని యెలాగో లొంగదీయడానికి యెంత ప్రయత్నిస్తారో చూడండి మీరు? చివరకు కేసు పర్యవసానం యేలావున్నా, మనకు యెంతజ్ఞానం కలుగుతుంది? ఇందువల్ల ప్రపంచములో మనం ధైర్యంగా సంచరించడానికి యెన్ని అవకాశాలు దొరుకుతాయి? ఈ 'పోయింటు' మీరు బాగా గ్రహించారోలేదో? గ్రహించాలి, తెలిసిందా! పాడుడబ్బు పోతేనేం ? తనువులు శాశ్వతం కానప్పుడు, డబ్బు

మాత్రం శాశ్వతమూ, వెర్రి కాబోతే!

★

పేజీలు తిరిగిపోతూవున్నాయి. (నేను చదువుతూవున్న పత్రికల పేజీలులెండి) గుర్రపు పందేల కోలాహలం వినబడుతూవుంది. పల్లెటూళ్లలో పూర్వపు వాసనలు వదల్లేక, క్షత్రియోచితమైనవని చెప్పి యిప్పటికికూడా కొందరు ప్రముఖులు, కోరమీసాలవారు (పెంద్రుకల గాంభీర్యమేగాని, లోపల లోతారమే) కోడి పందెములు జరుపుతూ వుంటారు. మీరుకూడా చూచే వుంటారు. ఈ పందెములు అవుతూ వున్నాయని ఆచోకీ యెలా తెలుస్తుందో, చల్లగా గ్రామంలోకి ఒక కానిస్టేబిలు వస్తాడు. పందెములుచూచి కొద్దో గొప్పో, మనుష్యమాత్రుడు కనుకనూ, క్షత్రియోచితమైన వీరరక్తము తనలోకూడా వుంది గనుకనూ, ఆనందిస్తాడు. ఇంతలో వో హేడ్డు, ఒక సబ్ఇన్స్పెక్టరూ మరికొంత సిబ్బందితో గ్రామములో ప్రవేశిస్తారు. పిడిగ్రుద్దులతో నేమి, లాఠీ ప్రయోగముతోనేమి వారి డ్యూటీ వారు నెరవేరుస్తారు. దెబ్బలు తిని పారిపోయే వాళ్ళు కొందరు, చచ్చినకోళ్ళను చంక బెట్టేవాళ్ళు కొందరు. ఇదేసందని దొరికిన మట్టుకు వృథాగా పోనివ్వడమేమని డబ్బుల దొంతర్లు మొలలో దోపేవారు కొంతమంది చుట్టలూ, బీడీలూ నెత్తిని పెట్టుకొని బయటపడితే బ్రతికిపోతామని చెప్పి పరుగెత్తబోయి బోర్లా పడేవారు కొందరు—

—మన గుర్రపు పందేలు చూడండి, యెంత ఆనందంగా వుంటాయో! అక్కడ చలామణీ అయ్యే డబ్బుకు లెఖ్ఖలేదు కదా. ఎంతెంత గొప్పవాళ్లు వస్తారు. గవర్నర్లు, ఆఫీసర్లు, లాయర్లు, బేంకర్లు, జమీందార్లు, వీరే కాకుండా మహా సముద్రము వంటి సామాన్య ప్రజలూ—ఎంత కోలాహలం, యెంత ఆనందం, యెంత వైభవం? చూస్తే కన్నుల పండువైపోతుంది. ఇక్కడ పోలీసువారు వచ్చి వీపులు చితుకకొడతారని కాని, నెత్తి బద్దలు కొడతారని కాని భయమేమీ లేదు కదా! సామాన్యమేమిటి! విదేశాల నుండి వచ్చిన తెల్లదొరలు సాగించే క్రీడకాని, నాటుదొరలు యేమారుమూలనో యెవరికీ తెలియకుండా నాటుదొరలు యేర్పాటు చేసిన పందెములు కావుగామరి!

గుర్రపు పందెములే కాకుండా, వివిధములైన క్రీడా వినోదాలు ప్రపంచమంతటా జరుగుతూ వున్నట్లు పత్రికలు చెబుతూ వున్నవి. ఒక మూల ప్రపంచములో ఘోరమైన యుద్ధాలు జరుగుతూ, కోటాన కోట్లుగా నిరపరాధులైన ప్రజలు-పురుషులు, స్త్రీలు, పసిపాపలూ-అన్యాయంగా మరణిస్తూ వుంటే; యేమూల చూచినను అన్నమో రామచంద్రాయని అసంఖ్యాకులైన తోడిమానవులు అహర్నిశలు వాపోస్తూ, దారిద్ర్యమును భరింపజాలక దిక్కులు పిక్కటిల్లేటట్లు రోదన చేస్తూవుంటే; చెవులు మూసుకొని, కరుణయనునది యేమూలనుండి చొరబడునోయని హృదయకవాటములను బంధించి మనుజుడన్నవాడు క్రీడా వినోదముల నోలలాడ మనసెట్లు కలిగెనో? ఇలా యేమేమో ఆలోచనలో మునిగిపోయి వుంటే, క్రమంగా బద్ధకం యెక్కువైంది. కళ్లు బరువెక్కినయి. నిద్రాదేవి నన్ను పూర్తిగా మంత్రించి వేసింది. తిరిగీ నాకు తెలివి వచ్చేసరికి పత్రిక నా చేతిలో నుండి జారిపోయి క్రిందపడివుంది.

---